www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 22 | అక్టోబర్ | 2026


## కలెక్టరేట్ ఎదుట జరిగే ఆందోళనను జయప్రదం చేయండి

**-సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**



ప్రజాపక్షం/ ఖమ్మం : ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపికలో రాజకీయ వివక్షను నిరసిస్తూ గురువారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట జరిగే ఆందోళనను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపికలో రాజకీయ వివక్ష కారణంగా నిజమైన లబ్దిదారులకు అన్యాయం జరుగుతుందన్నారు. అసలైన పేదలు ఇప్పటికీ ఇండ్లు లేక ఇబ్బందులు పడుతుంటే అధికార పక్షం, అధికారులు పట్టించుకోవడం లేదని సురేష్ తెలిపారు. దీనిని నిరసిస్తూ ఈనెల 22న కలెక్టరేట్ ఎదుట సిపిఐ, సిపిఎం, బిఆర్ఎస్, సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్, సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించనున్నట్లు సురేష్ తెలిపారు.

## మాయ'మత్స్య'ంద్ర..!



- ముందుకు సాగని చేప పిల్లల పంపిణీ
- ఇప్పటికే పూర్తయిన టెండర్లు
- 740 జలశాయాలకు గానూ అనుకూల 167 మాత్రమే
- జలాశాలల్లో ఎల్‌నినో ప్రభావం
- ఈ ఏడాది చేపపిల్లల పంపిణీ అనుమానమే
- రేపో మాపో రాష్ట్ర స్థాయి సమావేశంలో తుది నిర్ణయం
- లబోదిబోమంటున్న మత్స్యకార సంఘాలు

వివరాలు 2లో

## సమాజంలోని దుష్ట శక్తులను రూపుమాపాలి



- విజయదశమి వేళ ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలి
- ఎంఎల్‌ఎ కూనంనేని

2లో..

## పోలీసుల త్యాగాలు, సేవలు చిరస్మరణీయం



2లో

ప్రజాపక్షం దినపత్రికకు 8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

న్యూ ఇరా విద్యాసంస్థలు

A NEW ERA GROUP

NEW ERA
CBSE SCHOOL | JUNIOR COLLEGE (+1 & +2)
Fountain of Excellence | Home of the Ranker...
VI-X IIT Foundation | Nursery-12th CLASSES
Mamata Road, KHAMMAM.
82970 99951, 82970 99953

CBSE -&- STATE
DAY & RESIDENTIAL

BI.P.C + NEET VAIDYA | M.P.C + MAINS / ADVANCE ABHIYAN | M.P.C + MAINS / EAPCET MEDHA

NEW LITTLE FLOWER
CBSE SCHOOL | JUNIOR COLLEGE (+1 & +2)
Fountain of Excellence | Home of the Ranker...
VI-X IIT Foundation | Nursery-12th CLASSES
WYRA KHAMMAM.
8886 220 477/76
82970 99952

VIVAAN THE SCHOOL
Nursery to X
Srinivasa Nagar, KHAMMAM.
93813 61354

LITTLE FLOWER E.M SCHOOL
NURSERY - 7th CLASS | CBSE & STATE CURRICULUM
SBI Bank Backside, Main Road, ENKOOR
93813 07327

NLF'S SHINE SCHOOL
NURSERY - V CLASSES
Brahmanapalli, Wyra.
63008 62962

NEW LITTLE FLOWER
PRIDE CAMPUS (A/C)
WYRA, KHAMMAM. Nursery to 7th CLASSES
888622 0476, 888622 0477,
888622 0478, 888622 0479



# మాయ'మత్స్య'ంద్ర..!

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : మత్స్యకార సంఘాలు సొసైటీల అభివృద్ధికి గానూ ప్రభుత్వం ప్రతీ ఏటా అందించే ఉచిత చేప పిల్లల పంపిణీ ఈ ఏడాది అనుమా నంగా ఉంది. ఎన్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో జిల్యా వ్యాప్తంగా ఉన్న చెరువుల్లో నీటి నిల్వలు చేపల పెంపకానికి అనుకూలంగా లేవు.



జిలాల్లో 740 జలాశయాలకు గానూ కేవలం 167 జలాశయాల్లో మాత్రమే చేపలు వదిలేందుకు నీటి నిల్వలు ఉన్నట్లు ఆశాఖాధికారులు చెబుతున్నారు. దీంతో మత్స్యకారసంఘాలు, సొసైటీలు తీవ్ర నిరాశకు గురవుతున్నాయి.

### మాయ''మత్స్య''ంద్ర...

వాస్తవానికి జిల్లాలో మొత్తం చిన్నా పెద్ద కలిపి 740 జలాశయాలున్నాయి. వీటిలో 17699400 చేప పిల్లలను వదిలేందుకు మత్స్యశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. వాస్తవానికి జూలై నెలాఖఱు నాటికే లెక్కలు తేలాల్సున్నప్పటికీ ఆగస్టు చివరి నాటికి కూడా టెండర్లు పిలవలేదు. అదేమని ఎవరైనా అడిగితే చెరుల్లో నీళ్లే లేవుగా అంటూ బదులిచ్చారు. మరి నీళ్లు లేనప్పుడు అసలు టెండర్లను ఎందుకు పిలిచారనే ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. ఇద్దరు కాంట్రాక్టర్లు చేప పిల్లల పంపిణీకి కోసం టెండర్లు వేసి దక్కించుకున్నారు. వారిలో ఒకరు ఖమ్మం జిల్లా కల్లూరు సమీపంలో లోకారం వద్ద గల ఆదిత్య కంపెనీ, రెండో టెండరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శివ ఫిషరీస్ రమేష్‌కు దక్కింది. వాస్తవ నిబంధనల ప్రకారం ఆరు నెలలు పాటు నీటి నిల్వలు జలాశాయాల్లో 50 శాతం వరకు ఉంటూనే చేప పిల్లల పంపిణీకి చర్యలు తీసుకోవాలి. కానీ ఇక్కడ అందుకు విరుద్ధంగా సాగుతోంది. కాంట్రాక్టర్ల ఒత్తిడి కారణంగా అధికారులు నీటి నిల్వలు 33 శాతం ఉన్నా చాలంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 33 శాతం నీటి నిల్వలు ఇప్పుడు జలశాయాల్లో ఉండగా చేప పిల్లలు వదిలితే అవిపెరిగి పెద్దయ్యే వరకు వేసవి కాలం వచ్చి నీరు మరింత ఇంకిపోయే అవకాశం ఉంది. దీంతో వేసిన చేప పిల్లలకు మృతి చెందుతాయని పలువురు అంటున్నారు. చేపలు బ్రతికేందుకు అనువైన వాతారణం లేనప్పుడు కాంట్రాక్టర్లకు టెండర్లు కట్టబెట్టి వాటాలా కోసం సుమారు రూ.17 కోట్ల ప్రజాధనాన్ని వృధా చేసేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి.

### రేపో మాపో సమావేశం...

చేరువుల్లో చేప పిల్లలను విడుదల చేసేందుకు మత్స్సశాఖ ఆధ్వర్యంలో రేపో మాపో రాష్ట్ర స్థాయి సమావేశాన్ని ప్రభుత్వం నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం హైదరాబాద్ కేంద్రంగా 33 జిల్లాల నుండి జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే టెండర్లు పూర్తవగా 33 శాతం నీటి నిల్వలు ఉన్నా చేప పిల్లల పంపిణీ చేయాలనే ఆదేశాలు రావచ్చే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### అనుమానమే...

ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల దృష్ట్యా 33 శాతం నీటి నిల్వలు చేప పిల్లలు బ్రతకడం కష్టమనే చెబుతున్నారు. ఇది చేప పిల్లల ఎదుగుదల పై తీవ్ర ప్రభావం చూపే అవకాశముంది. ఆక్సిజన్ ఆహారం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. చేపపిల్లలు చేతికందే సమయానికి వేసవి చొరబడే అవకాశం ఉండటంతో నీటి నిల్వలు వేగంగా తగ్గిపోతే వాటి మనుగడ ప్రశ్నార్థకమే. మరో ప్రక్క కొద్దిశాతమే ఉన్న నీరు వేడెక్కి ఆక్సిజన్ అందక సామూహిక మృత్యువాత పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

### లబోదిబో...

జిల్లా వ్యాప్తంగా 82 మత్స్యకార సంఘాలుండగా 3827 మంది సభ్యులున్నారు. మత్స్యకార సంఘాలకు ఆదాయం పెంచే విధంగా ప్రభుత్వం ప్రతీ ఏటా చెరువుల్లో ఉచితంగా చేప పిల్లలను విడుదల చేస్తుంది. కానీ ప్రస్తుత ఎల్‌నినో ప్రభావంతో కేవలం 167 చెరువులు మాత్రం చేపపిల్లల విడుదలకు అనుకూలం కావడంతో ఈ సారి మత్స్యకార సంఘాల ఆదాయానికి గండిపడే ప్రమాదముంది. దీంతో సంఘాల సభ్యులు లబోదిబో మంటున్నారు. ప్రభుత్వం ఏదైనా ప్రత్యామ్నాయ మార్గాన్ని ఆలోచన చేసి మత్స్యకారులను ఆదుకోవాలని పలువురు వేడుకుంటున్నారు.

# పోలీసుల త్యాగాలు, సేవలు చిరస్మరణీయం

-శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం
-ఆధునిక సాంకేతికతతో పోలీసింగ్
-అమర వీరుల పోలీస్ కుటుంబ సభ్యులకు సన్మానం
-పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్, సిపి






ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : పోలీసుల త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు భరోసా, రక్షణ కల్పించడంలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బుధవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా ఖమ్మం పోలీస్ హెడ్ క్వార్టర్స్ పరేడ్ మైదానంలో నిర్వహించిన స్మృతి పరేడ్ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి పాల్గొన్నారు. పరేడ్ మైదానంలోని పోలీస్ అమరవీరుల స్మారక స్తూపం వద్ద కలెక్టర్, సిపి, పోలీస్ అధికారులు, సిబ్బంది, పోలీస్ కుటుంబ సభ్యులు పుష్పాంజలి ఘటించి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరులను స్మరించుకుని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా దివాకర టిఎస్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం లడఖ్ సరిహద్దు ప్రాంతంలో ప్రాణ త్యాగం చేసిన వీరుల స్ఫూర్తిని స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పోలీస్ జెండా కేవలం ఒక వస్త్రం కాదని పోలీస్ శాఖ నిత్యం ప్రదర్శించే నిబద్ధత, త్యాగం, గౌరవానికి ప్రతీక అన్నారు. జిల్లా యంత్రాంగం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్న క్రమంలో ప్రగతికి తోడుగా ప్రజలకు భరోసా, రక్షణ కల్పిస్తూ శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు వారి కుటుంబ సభ్యుల సహకారం కూడా ఎంతో అవసరం అన్నారు. ప్రస్తుతం నేరాల స్వరూపం వేగంగా మారుతుందని సైబర్ నేరాలు, ఆన్ లైన్ మోసాలు సహా కొత్తతరహా నేరాలు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో వాటిని సమర్థవంతంగా అరికట్టేందుకు పోలీసింగ్ విధానాలను ఆధునికరిస్తూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసింగ్‌లో వినియోగించడంలో తెలంగాణ పోలీస్ శాఖ దేశంలో ముందంజలో ఉందన్నారు.

### అమరుల త్యాగాలు దేశానికి స్ఫూర్తి : సిపి

1959 అక్టోబర్ 21న లడఖ్ ప్రాంతంలో చైనా సైనికులతో పోరాడుతూ దేశ సరిహద్దులను కాపాడే క్రమంలో 10 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లు ప్రాణ త్యాగం చేశారన్నారు. వారి త్యాగాలకు గుర్తుగా ప్రతి ఏడాది అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ సిబ్బంది త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకుంటున్నామన్నారు. అనంతరం పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులను కలెక్టర్, సిపిలు శాలువలతో సత్కరించి గౌరవించారు. నలుగురు పోలీస్ సిబ్బంది తమ ఇంటి స్థలాలకు సంబంధించిన సమస్యపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ వారికి ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించడంతో పాటు సంబంధిత ఉత్తర్వులను కూడా జారీ చేసినట్లు తెలిపారు. కేటాయించిన స్థలాలను స్వాధీనం చేసుకోవాలని వారికి సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి రామానుజం, ఏఆర్ డిసిపిలు కుమారస్వామి, విజయ్‌బాబు, ఏసిపిలు సుశీల్ సింగ్, నర్సయ్య, రమణమూర్తి, మహేష్, సాంబరాజు, నర్సింహారావు, సిఐలు, ఆర్ఐలు, పోలీస్ అధికారులు, సిబ్బంది, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సమాజంలోని దుష్ట శక్తులను రూపుమాపాలి

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కొత్తగూడెం పట్టణపరిధిలోని రైటర్‌బస్తీతోపాటు రామవరంలోని అంబేద్కర్ చమన్ వద్ద సంగరేణి సంస్థ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఆయన ముఖ్యాతిథిగా హాజరై ప్రత్యేక జమ్మి పూజ నిర్వహించారు. అనంతరం సాంప్రదాయ బద్దంగా రావణాసురుడి దిష్టిబొమ్మ దహనం (రావణవధ) కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాణాసంచా వెలుగుల నడుమ రావణ వధను వీక్షించేందుకు భారీగా తరలివచ్చిన అశేష జనవాహిణిని ఉద్దేశించి మాట్లాడారు. సమాజంలో నెలకొన్న అసమానతలు అన్యాయాలు చెడు ఆలోచనలను అంతమొందించేందుకు దుర్మార్గాన్ని అణిచివేసి ధర్మ మార్గాన్ని అనుసరించడమే అసరైన దసరా ఉద్దేశ్యం అన్నారు. ప్రజలంతా కలిసికట్టుగా ముందుకు సాగాలని కూనంనేని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు దసరా శుభా కాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, సింగరేణి గుర్తింపు సంఘం నాయకులు వంగ వెంకట్, రమణమూర్తి, జె గట్టయ్య కంచర్ల జమలయ్య మునిగడప వెంకటేశ్వర్లు పద్మ ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా హుస్సేన్



ప్రజాపక్షం/ తల్లాడ : తెలంగాణ ఉద్యమకారుడు, యువ నాయకుడు షేక్ హుస్సేన్‌ను ఖమ్మం జిల్లా టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఎంపిక చేశారు. ఖమ్మం జిల్లా ఉద్యమాల్లో కీలకంగా పనిచేసిన హుస్సేన్ మొదటి నుంచి కవిత అనుచరుడిగా కొనసాగుతున్నారు. ఖమ్మం జిల్లాలో కల్వకుంట్ల కవితకు నమ్మకమైన వ్యక్తిగా ఉన్నారు. హుస్సేన్ స్వస్థలం ఖమ్మం జిల్లా తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామం. జిల్లాలో తెలంగాణ ఉద్యమంలో ఎన్నో పోరాటాలు, ఎన్నో సభలు, సమావేశాలు నిర్వహించి సరిహద్దు ప్రాంతమైన ఖమ్మంజిల్లాలో ఈ ప్రాంత ప్రజల్లో చైతన్యం నింపి తెలంగాణ ఉద్యమాన్ని కీలకంగా ముందుకు తీసుకెళ్లడంలో తన పాత్ర చాలా కీలకమన్నారు. ప్రజా సమస్యలపై పోరాడతానని ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు.

## టిపిసిసి వైస్ ఛైర్మన్ నారపోగును సన్మానించిన జర్నలిస్టులు



ప్రజాపక్షం/ తల్లాడ : తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సి విభాగం వైస్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తల్లాడ మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన నారపోగు వెంకటేశ్వర్లును తల్లాడ జర్నలిస్టులు సన్మానించారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని స్వగ్రామానికి వచ్చిన ఆయనను బుధవారం జర్నలిస్టులు మిఠాయిలు తినిపించి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు దేవబత్తిని సీతారాములు, గోర్ల బాబురావు, కాంపాటి రవి, గోర్ల నర్సింహారావు, గొల్లమందల ప్రేమ్‌కుమార్ లు ఉన్నారు.

## ఏజెన్సీలో వసుధ సేవలు మరువలేనివి

### - ఎంఎల్‌ఏ డా.తెల్లం



ప్రజాపక్షం/భద్రాచలం : ఏజెన్సీ ప్రాంతంలో వసుధ సేవలు మరువలేనివని ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు అన్నారు. పట్టణానికి చెం దిన భద్రకాళి అనే మహిళ క్యాన్సర్‌తో బాధ పుడుతుండగా ఆమె వైద్య సేవల కోసం వసుధ ఫౌండేషన్ రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించిందన్నారు. కుటుంబ సభ్యుల అభ్యర్ధన మేరకు అందించిన మొత్తాన్ని ఎంఎల్‌ఏ తన చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కన్వీనర్ విఘ్నేష్ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా మట్టి తోలకాలు




ప్రజాపక్షం/పాల్వంచ : గత కొన్ని రోజులుగా స్థబ్దుగా ఉన్న అక్రమార్కులు జోరందుకొన్నారు. సెలవు రోజులను లక్ష్యంగా చేసుకొని చెలరేగి పోతున్నారు. మండల పరిధి రంగాపురం గ్రామంలో గత రెండు రోజులుగా అక్రమ మట్టి తోలకాలను జోరుగా సాగిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. నాగారం గ్రామ సమీపం లోని పాత క్రషర్ మిల్ దగ్గర ఖాళీ స్థలం నుండి అనుమతులు లేకుండా జేసిబి సహాయంతో మట్టిని తోడుతూ రంగాపురం గ్రామానికి ట్రాక్టర్లతో రవాణా చేస్తున్నారు. అధికారులు స్పంధించి గ్రావెల్ అక్రమ రావాణాను నిలిపివేసి ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడాలని పలువురు కోరుచున్నారు.

# నవంబర్ 15 నుంచి ఏఐకెఎస్ జాతీయ మహాసభలు




**-15న నల్గొండలో లక్ష మందితో భారీ బహిరంగ సభ**
**-రైతు సంక్షేమానికి ఉద్యమ కార్యాచరణ**
**-మీడియా సమావేశంలో పోతినేని**

**ప్రజాపక్షం/ఖమ్మం :** అఖిల భారత కిసాన్ సభ (ఏఐకెఎస్) 36వ జాతీయ మహాసభలు నవంబర్ 15 నుంచి 18 వరకు నల్గొండలో జరగనున్నాయని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ తెలిపారు. 15న 15వేల మంది రెడ్‌షర్ట్ వాలంటీర్లతో కవాతు నిర్వహించనున్నామని, లక్ష మందితో బహిరంగ సభ జరుగుతుందని ఆయన తెలిపారు. బుధవారం ఖమ్మం సుందరయ్య భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో పోతినేని మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 1979లో జాతీయ మహాసభలు జరిగాయని 37 ఏళ్ల తర్వాత తిరిగి తెలంగాణ గడ్డపై జాతీయ మహాసభలు జరగడం ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. ఈ మహాసభలకు సంబంధించి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. భారత వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, రైతాంగ భవిష్యత్తుపై లోతైన చర్చ జరపనున్నట్లు పోతినేని తెలిపారు. రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కుల పరిరక్షణ, ఐక్య ఉద్యమాలను మరింత బలోపేతం చేసే కార్యాచరణను మహాసభల్లో వెల్లడిస్తామన్నారు. వృద్ధులైన కౌలు, పేద రైతులు ఎటువంటి ఆధారం లేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వీరికి రూ. 10వేల పింఛన్‌ను మంజూరు చేయాలని, కనీస మద్ధతు ధరల చట్టాన్ని తీసుకు రావాలని ఆయన డిమాండ్ చేశారు. అఖిల భారత రైతు సంఘం ఆవిర్భావించి 90 ఏళ్లు పూర్తి కావస్తుందని అనేక చారిత్రిక ఉద్యమాలు నిర్వహించిన ఘనత ఏఐకెఎస్‌కు దక్కుతుందన్నారు. 1936లో బ్రిటిష్ పాలనలో రైతు సంఘం పురుడు పోసుకుందని ఆయన తెలిపారు. దున్నే వానికే భూమి దక్కాలని, వెట్టి చాకిరి రద్దు కావాలని జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో రైతు సంఘం వీరోచిత పాత్ర నిర్వహించిందన్నారు. కార్పొరేట్లకు కొమ్ముకాస్తే విధానాలను ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని రైతు రుణాలను మాఫీ చేయడంతో పాటు స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలన్నారు. రైతుల పాలిట మరణశాసనాలుగా మారిన నూతన సాగు చట్టాలను రద్దు చేయాలని సుదర్శన్ డిమాండ్ చేశారు. రైతు బీమా పథకంలో సమూల మార్పులు చేసి మెరుగైన రక్షణ కల్పించాలని, ఉచిత విద్యుత్‌ను హక్కుగా మార్చి నిరంతరం సరఫరా చేయాలన్నారు. మీడియా సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యులు నున్నా నాగేశ్వరరావు, సిపిఎం రైతు సంఘం నాయకులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, బండి రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ విజయదుర్గా అయ్యప్పస్వామి ఆలయ 11వ వార్షికోత్సవం







**-కన్నులపండువగా అయ్యప్ప స్వామి పదునెట్టాంబడి, దుర్గామాత పడిపూజలు**
**-భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం..**
**-మహా అన్నదానంలో పాల్గొన్న భక్తజనం**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని రాజీవ్ నగర్‌లో కొలువుదీరిన శ్రీ విజయదుర్గా అయ్యప్పస్వామి దేవాలయ 11వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తాటిపర్తి వీరబ్రహ్మాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాల్లో అయ్యప్ప స్వామి, దుర్గామాతలకు నిర్వహించిన ప్రత్యేక పూజలు భక్తులను ఆధ్యాత్మిక పారవశ్యంలో ముంచెత్తాయి. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని తెల్లవారుజామున దుర్గమ్మవారికి, అయ్యప్ప స్వామికి నవనీత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివార్లకు ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు చేపట్టారు. నారాయణ సేవలో భాగంగా మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. రాత్రి నిర్వహించిన అయ్యప్ప స్వామి పదునెట్టాంబడి పూజ, దుర్గామాత పడిపూజలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రెండు పూజలు ఏకకాలంలో అత్యంత వైభవంగా జరగడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తిమయ వాతావరణం నెలకొంది. దీపాల వెలుగులు, భక్తుల అయ్యప్ప నామస్మరణలు, అమ్మవారి భజనలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. రెండు పడిపూజలను వీక్షించేందుకు భక్తులకు రెండు కళ్లూ చాలనంత అద్భుతంగా వేడుకలు సాగాయి. మండలంలోని పరిసర గ్రామాల నుంచి అయ్యప్ప మాలధారులు, భవానీ మాలధారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సత్తుపల్లి పట్టణంలోని 22 వార్డుల నుంచి భక్తులు భారీగా హాజరుకావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. స్వామివార్ల దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు చల్లగుళ్ల నర్సింహరావు, తుమ్మూరు వెంకటరెడ్డి, పొంగ్రీ పాపారావు, ఆర్.వి.ఆర్., శ్రీకాంత్, అయ్యప్ప, సురేష్, కృష్ణారావు, అబ్దుల్లా, సురేష్ తదితరులు పాల్గొన్నారు. భక్తుల సహకారంతో వార్షికోత్సవ వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

# ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆయుధ పూజ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** దేవీ శరన్నవరాత్రులు విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆయుధపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఖమ్మం నగరంలోని కొత్తగూడెంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో ఆయుధపూజ నిర్వహించారు. ఈ వేడుకల్లో ముదిరాజ్ సంఘం నాయకులు, యువకులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి లోక కళ్యాణం కోసం ప్రార్థించారు. ఈ పూజా కార్యక్రమంలో సంఘం నాయకులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిట్టల వెంకట నర్సయ్య, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు రావుల హన్మంతరావులు మాట్లాడుతూ విజయదశమి ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలను, ఐశ్వర్యాలను నింపాలని ఆకాంక్షించారు. ఇలాంటి వేడుకలు ఐక్యతను, భక్తిభావాన్ని పెంపొందించడంలో ఎంతగానో దోహద పడతాయన్నారు. పూజ అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు అక్కి కోటయ్య, గోల్కొండ అంజయ్య, పర్వత వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రమేష్, వెంకటేశ్వర్లు, నర్సింహారావు, కనకయ్య, బుడిగె వెంకన్న, రావుల సంజీవరావు, నాగటి శేషయ్య, శీతల చిన్న లక్ష్మయ్య, మాకనబోయిన నాగేశ్వరరావు, గొడుగు రాము, ప్రతానపు రామనాథం, సైదులు, రాములు, చాగంటి వెంకటనర్సయ్య, పెద్ద తిరుములు, పుల్లయ్య, అప్పారావు, శంకర్, వెంకటేశ్వర్లు, శ్రీను, రవి పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** జయదశమి దసరా పండుగను పురస్కరించుకుని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దంపతులు వారి నివాసంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు చేసిన అనంతరం సంప్రదాయబద్ధంగా ఆయుధ పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే వినియోగించే వాహనాల తో పాటు, ఆమె భద్రతా సిబ్బంది గన్‌మెన్ల ఆయుధాలకు పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా బేగం కమల్ పాషా పాల్గొన్నారు. సరా పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో సాగింది. విజయదశమి సందర్భంగా ఆయుధ పూజ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని, ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు లభించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# ఓటు తొలగింపు ప్రజాస్వామ్యానికి ముప్పు

**-అరసం అధ్యక్షులు రామయ్య**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఓటు తొలగింపు ప్రజాస్వామ్యానికి ముప్పు అని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా అధ్యక్షులు కొంపెల్లి రామయ్య తెలిపారు. బుధవారం ఓటు మన హక్కు అనే అంశంపై స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ ఓటర్ల సమగ్ర సవరణ పేరుతో ఓట్లను తొలగిస్తున్నారని ఎన్నికల కమిషనర్ నిర్ణయం వల్ల పలువురు ఓటు హక్కుకు దూరమవుతున్నారని ఆయన తెలిపారు. 13 కోట్ల ఓట్లు తొలగించడం ద్వారా ప్రజాస్వామ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి ఓటు ప్రతి పౌరుని హక్కు అని ఈ ప్రాథమిక హక్కును తొలగించడం అన్యాయమన్నారు. కవులు తమ రచనల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయాలని ఆయన కోరారు. ఓటు మన హక్కు అనే అంశంపై జరిగిన కవి సమ్మేళనంలో పలువురు తమ కవితలను వినిపించారు. ఈ కార్యక్రమంలో డా॥ ఆంజనేయులు, శింగు నర్సింహారావు, సృజన్‌కుమార్ పాల్గొన్నారు.

# వైభవంగా అమ్మవారి శోభాయాత్ర



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో తొమ్మిది రోజులు పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో సాగిన దేవీ శరన్నవరాత్రులు వైభవంగా ముగిశాయి. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం ఖమ్మంలో నిర్వహించిన దుర్గామాత శోభాయాత్ర కన్నుల విందుగా సాగింది. జై భవాని, జైజై భవాని, దుర్గామాతకు జై అంటూ భక్తుల జయ జయ ధ్వనులతో నగర వీధులు మార్మోగాయి. వివిధ కాలనీలు ప్రధాన కూడళ్లలో ప్రతిష్ఠించిన అమ్మవార్ల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో విధుల్లో శోభాయాత్రను నిర్వహించారు. మహిళల కోలాటాలు, దండియా నృత్యాలు, డప్పు వాయిద్యాల మధ్య శోభాయాత్ర నిర్వహించి అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని పూజించారు. ఖమ్మం నగరంలోని 8వ డివిజన్ బాలపేటలో అమ్మవారి శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు భూక్యా అశోక్, ఎఎంసి మాజీ డైరెక్టర్ అజ్మీర వెంకన్న, మహిళలు పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటి ప్రత్యేక పూజలు





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని రేజర్ల గ్రామ సమీపంలోని గుట్టపై కొలువుదీరిన శ్రీ నాగ మల్లేశ్వర స్వామి ఆలయంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని కోరుకున్నారు. తెలుగు ప్రజలందరికీ విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, రేజర్ల సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మంత్రి పొంగులేటి అభిమానులు, భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పార్టీ కార్యాలయంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రం



**ప్రజాపక్షం/మధిర:** మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు డీక్లస్టర్ కేంద్రాన్ని మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పట్టభద్రుదల తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకునేందుకు ఎమ్మెల్సీ ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు. ఓటరు నమోదుకు ఆధార్‌కార్డు, ఓటర్ ఐడి, డిగ్రీ సర్టిఫికెట్, పాస్ పోర్ట్ సైజు ఫొటో తదితర అవసరమైన పత్రాలతో నమోదు కేంద్రానికి రావాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నమోదు కేంద్రంలో సిబ్బంది అందుబాటులో ఉంటారని, నవంబర్6 2026 ఓటరు నమోదుకు చివరి తేది అని తెలిపారు. పట్టభద్రులందరూ ఓటును నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య బలోపేతంలో ప్రతి పట్టభద్రుడి భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సూరంశెట్టి కిషోర్, సర్పంవలు సంపసాల రామకృష్ణ, పగిడిపల్లి శ్రీనివాసరావు, మువ్వా వెంకయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు ఏరియా వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 122. 10 లక్షల టన్నులు

**లక్ష్య సాధనకు సమష్టి కృషి చేయాలి**
**సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ**



**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ బుధవారం మణుగూరు ఏరియాలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు ఇంచార్జ్ జనరల్ మేనేజర్ డి. వెంకట రామారావు, సంబందిత అధికారులతో కలిసి కేఎచ్పీహెచ్పి (కెసిహెచ్‌పి), పీకేఓసీ గనులను సందర్శించి, బొగ్గు ప్రాసెసింగ్, క్రషర్ల పనితీరు, బొగ్గు వెలికితీత, ఉత్పత్తి లక్ష్యాల సాధనకు చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 202627 ఆర్థిక సంవత్సరానికి మణుగూరు ఏరియాకు నిర్దేశించిన 122.10 లక్షల టన్నుల వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు.

### కేఎచ్పీహెచ్పి సందర్శన...

డైరెక్టర్ (ఆపరేషన్స్) కేఎచ్పీహెచ్పీని సందర్శించి, బొగ్గు ప్రాసెసింగ్ కార్యకలాపాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బొగ్గు పెద్దపెళ్లలు, క్రషర్ల పనితీరును సమీక్షించారు. బొగ్గును నిర్దేశిత పరిమాణంలోకి తీసుకువచ్చేందుకు క్రషర్లు సమర్థవంతంగా పనిచేయడం ముఖ్యమని పేర్కొన్నారు. క్రషర్ల నిర్వహణ, మరమ్మతులను సకాలంలో చేపడుతూ, యంత్రాలు నిరంతరాయంగా పనిచేసేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. బొగ్గులో మట్టి. రాళ్లు ఇతర మలినాలు కలవకుండా జాగ్రత్తలు పాటిస్తూ, నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ప్రాసెసింగ్ చేపట్టాలని తెలిపారు. నాణ్యమైన బొగ్గును వినియోగదారులకు అందించేందుకు నాణ్యత నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు.

### పీకేఓసీ-11 గని సందర్శన...

అనంతరం డైరెక్టర్ (ఆపరేషన్స్) పీకేఓసీగనిలోని వ్యూ పాయింట్‌ను సందర్శించి, గని కార్యకలాపాలు, ఉత్పత్తి పరిస్థితులను పరిశీలించారు. తదుపరి బొగ్గు బెంచ్ లను సందర్శించి, అక్కడ జరుగుతున్న బొగ్గు వెలికితీత పనులను క్షేత్రస్థాయిలో సమీక్షించారు. బొగ్గు ఉత్పత్తి పురోగతి, నాణ్యత, పరిమాణం సాధనకు అనుసరిస్తున్న విధానాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. రోజువారీ ఉత్పత్తి లక్ష్యాలను సాధించడంతో పాటు, బొగ్గు నాణ్యతను కాపాడుతూ నిర్దేశిత పరిమాణంలో ఉత్పత్తి సాధించాలని సూచించారు. గనిలో అందుబాటులో ఉన్న యంత్రాలు, మానవ వనరులను సమన్వయంతో వినియోగించుకుంటూ, ఉత్పత్తి ప్రక్రియలో తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని తెలిపారు.

### గనుల్లో డీవాటరింగ్ పనులపై ప్రత్యేక దృష్టి...

గనుల్లో బొగ్గు వెలికితీత పనులకు ఆటంకాలు కలగకుండా, బాటమ్ బెంచ్‌లు ఇతర అవసరమైన ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని సకాలంలో తొలగించేందుకు (డీవాటరింగ్) తగిన ఏర్పాట్లు చేపట్టాలని డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ అధికారులకు సూచించారు. డీవాటరింగ్ పంపులు, సంబంధిత పరికరాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. నీటి కారణంగా బొగ్గు ఉత్పత్తి పనులకు అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని, రక్షణ ప్రమాణాలను పాటిస్తూ ఉత్పత్తి కార్యకలాపాలు నిరంతరాయంగా సాగేలా చూడాలని సూచించారు.

### వార్షిక లక్ష్యం 122.10 లక్షల టన్నులు...

రోజుకు 40,000 టన్నుల ఉత్పత్తిఈ సందర్భంగా డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ మాట్లాడుతూ, 202627 ఆర్థిక సంవత్సరానికి మణుగూరు ఏరియాకు నిర్దేశించిన 122.10 లక్షల టన్నుల వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో పనిచేయాలని సూచించారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా రోజుకు 40,000 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకునే దిశగా పటిష్టమైన ప్రణాళికలతో ముందుకు సాగాలని తెలిపారు. గనులు, అనుబంధ విభాగాల మధ్య సమన్వయాన్ని పెంపొందించి, రోజువారి ఉత్పత్తి లక్ష్యాలను నిరంతరం సమీక్షించాలని సూచించారు. బొగ్గు ఉత్పత్తి పరిమాణాన్ని పెంచడంతో పాటు నాణ్యతను కాపాడటం, ఉత్పత్తి చేసిన బొగ్గును సకాలంలో ప్రాసెసింగ్ చేసి రవాణాకు సిద్ధం చేయడం ద్వారా ఏరియా నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని పేర్కొన్నారు.

అందుబాటులో ఉన్న షావెల్స్, డంపర్లు, ఇతర భారీ యంత్రాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, వాటి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. యంత్రాల నిర్వహణ, సాంకేతిక సమస్యల పరిష్కారానికి ముందస్తు చర్యలు చేపట్టి, పనివేళల నష్టాన్ని తగ్గించాలని తెలిపారు. ఉత్పత్తి పెంపునకు అవసరమైన చర్యల్లో భాగంగా యంత్రాల పని గంటలను రోజుకు 16 గంటలకు పెంచే దిశగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. షిఫ్టుల నిర్వహణ, యంత్రాల లభ్యత, సిబ్బంది సమన్వయంపై ప్రత్యేక దృష్టి సారించి, పూర్తిస్థాయి పని గంటలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

### రక్షణ, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత...

బొగ్గు ఉత్పత్తి పెంపు క్రమంలో రక్షణ ప్రమాణాల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని డైరెక్టర్ (ఆపరేషన్స్) స్పష్టం చేశారు. గనుల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది నిర్దేశిత రక్షణ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, భారీ యంత్రాల నిర్వహణ, బొగ్గు వెలికితీత పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉత్పత్తి పరిమాణాన్ని పెంచడంతో పాటు బొగ్గు నాణ్యతను కాపాడటం, యంత్రాల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించడం, పని గంటలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా వార్షిక లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈ పర్యటనలో ఏరియా ఇంజినీర్ వి. మధన్ నాయక్, డీజీఎం (కేఎచ్పీహెచ్పీ) ఆర్.ఎస్. గౌడే, ప్రాజెక్ట్ మేనేజర్ సౌరభ్ సుమన్, మేనేజర్ (ఆపరేషన్స్) సురేశ్ , క్వాలిటీ హెచ్డీ నాగరమేష్, ఏరియా సెక్యూరిటీ అధికారి కే. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరులకు ఘన నివాళి





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అమరవీరులకు ఘన నివాళ్ళులర్పించారు బెటాలియన్ అధికారులు, సిబ్బంది. మండల పరిధిలోని బేతుపల్లి గంగారం లోని 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో బుధవారం పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెటాలియన్ కమాండెంట్ ఎన్. పెద్దబాబు హాజరై, విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల స్మారక స్థూపం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్మృతి పరేడ్ ద్వారా అమరవీరులకు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా కమాండెంట్ పెద్దబాబు మాట్లాడుతూ దేశంలోని వివిధ పోలీసు విభాగాల్లో విధులు నిర్వహిస్తూ దేశ రక్షణ, సమాజ శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. సంఘ విద్రోహ శక్తులను సమర్థంగా ఎదుర్కొంటూ, ప్రజలకు రక్షణ కల్పించేందుకు పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అదనపు కమాండెంట్ ఏ. అంజయ్య, అసిస్టెంట్ కమాండెంట్ బి. వినాయకరావు, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది, హోంగార్డులు పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు.

## నేడు కొమరం భీం విగ్రహావిష్కరణ

**-ములకపాడు సెంటర్‌లో మహోత్సవం**
**-ఆదివాసీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు**






**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** ఆదివాసీ ఆత్మగౌరవ పోరాట వీరుడు కొమరం భీం విగ్రహావిష్కరణ మహోత్సవం నేడు(గురువారం)దుమ్ముగూడెం మమండలం ములకపాడు సెంటర్‌లో నిర్వహించనున్నారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా జల్ జంగల్ జమీన్ నివాదంతో పోరాడిన కొమరం భీం ఆదివాసీల హక్కుల సాధనకు స్ఫూర్తిగా నిలిచారని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆదివాసీ యువతీ యువకులు, పెద్దలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘం దుమ్ముగూడెం మండల ప్రధాన కార్యదర్శి పిలుపునిచ్చారు.

## ఎమ్మెల్యే పాయంను మర్యాద పూర్వకంగా కలిసిన తోలెం కళ్యాణి



**ప్రజాపక్షం/మణుగూరు:** బూర్గంపాడు మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తోలెం కళ్యాణి బుధవారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తొలుత ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నూతన బూర్గంపాడు మార్కెట్ కమిటీ చైర్మన్ తోలెం కళ్యాణిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తోలెం కళ్యాణి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తోలెం కళ్యాణికి నూతన బాధ్యతల సందర్భంగా అభినందనలు తెలియజేస్తూ, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మద్దెల సమ్మయ్య పొట్లపల్లి సర్పంచ్, తోలెం మల్లేష్, తాల్ల గుట్టయ్య, పడిగ నాగయ్య, తోలెం క్రిష్ణ, షేక్ మధార్, పడిగ వీరబాబు, కొమరం శ్రీను, తోలెం అర్జున్, బడే వెంకటేశ్వర్లు, తోలెం సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పర్ణశాలలో ఘనంగా సీతారాముల శమీ పూజ





**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి అనుబంధ ఆలయమైన పర్ణశాల దేవస్థానంలో బుధవారం ఆలయ జీర్ణోద్ధరణ జరిగి 52 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈసందర్భంగా స్వామివారికి ఏకాంతంగా పంచామృత అభిషేకం, సుందరకాండ పారాయణం, మహా పూర్ణాహుతి హవనం నిర్వహిస్తారు. అనంతరం స్వామివారి తిరుకళ్యాణ మహోత్సవం, మహా పట్టాభిషేకం, మహా నివేదన, తీర్థప్రసాద గోష్టి కార్యక్రమాలు జరగనున్నాయి. సాయంత్రం 4గంటలకు స్వామివారు తిరువీధి సేవగగా బయలుదేరి దసరా మండపం వద్దకు చేరుకుంటారు. అక్కడ శమీ పూజ నిర్వహించిన అనంతరం అశ్వవాహనంపై ఆలయానికి తిరిగి వేంచేస్తారు. అనంతరం నివేదన, తీర్థప్రసాద గోష్టితో కార్యక్రమాలు ముగియనున్నాయి.

## తండ్రికి కొరివి పెట్టిన చిన్నారి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** ముక్కుపచ్చలారని ఓ చిన్నారి తన తండ్రి ఆఖరి కోరికను నెరవేరుస్తూ అంతిమ సంస్కారాలు నిర్వహించిన హృదయ విదారక ఘటన పెనుబల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వంగా వంశీకి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంత కాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ విజయదశమి పండుగ రాత్రి 9 గంటల సమయంలో కన్నుమూశారు. కాగా, తాను మరణిస్తే తన అంత్యక్రియల్లో పెద్ద కుమార్తె బిందుశ్రీయే తలకొరివి పెట్టాలని వంశీ జీవించి ఉన్న సమయంలోనే తన చివరి కోరికగా తెలిపాడు. వంశీ కోరికను గౌరవమిస్తూ బంధువులు, కుటుంబ సభ్యులు ఆ చిన్నారి చేతుల మీదుగానే అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కన్నీరు మున్నీరుగా విలపిస్తూ బిందుశ్రీ తన తండ్రి చితికి నిప్పు పెట్టి కడసారి వీడ్కోలు పలికిన తీరు చూసిన వారిని తీవ్రంగా కలచివేసింది. పండుగ వేళ వంశీ అకాల మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# వైరా మండలంలో ప్రభుత్వ అధికారులకు సమయపాలన లేదా..!?



**-10గంటలకు తెరుచుకోవాల్సిన కార్యాలయాలు..**
**11, 12 గంటలకు తెరుచుకుంటున్న వైనం**
**-మరికొన్ని చోట్ల మధ్యాహ్నం తర్వాతే అధికారుల రాక**
**-అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు**

**ప్రజాపక్షం/వైరా:** ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించాల్సిన అధికారులు సమయపాలన పాటించకపోతే సామాన్యుల సమస్యలు పరిష్కారమయ్యేదెలా? ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన వేళ...కొందరు అధికారులు, సిబ్బంది ఆలస్యంగా విధులకు హాజరవుతున్నారనే విమర్శలు వైరా మండలంలో కనిపిస్తున్నాయి. కార్యాలయాల చుటూ పనుల కోసం తిరుగుతున్న ప్రజలకు సమయానికి అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు ఉదయం 10గంటలకు ప్రారంభం కావాల్సి ఉంగా, కొన్ని శాఖల్లో అధికారులు, సిబ్బంది 11 గంటలకు, మరికొందరు మధ్యాహ్నం 12 గంటలకు, ఇంకొందరు మధ్యాహ్నం తర్వాత విధులకు వస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల్లో చాలామంది కూలీలు, రైతులు, చిరు వ్యాపారులు ఉంటారు. తమ పనులను పక్కనపెట్టి కార్యాలయాలకు వచ్చినా సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోతే గంటల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వారు వాపోతున్నారు. ఒక చిన్న సంతకం కోసం, ధృవీకరణ పత్రం కోసం, సమస్య పరిష్కారం కోసం పలుమార్లు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తే సామాన్యుల సమయం, డబ్బు వృధా అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగం అంటే కేవలం విధులకు హాజరు కావడం మాత్రమే కాదు. ప్రజలకు సకాలంలో సేవలు అందించడం కూడా నిర్ణీత సమయానికి కార్యాలయాలకు చేరుకొని, ప్రజల సమస్యలను వినడం, వాటిని నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం అధికారుల బాధ్యత. సమయపాలన లోపిస్తే ప్రభుత్వ సేవలపై ప్రజలకు నమ్మకం తగ్గే ప్రమాదం ఉంది. వైరా మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో విధుల నిర్వహణ, హాజరు నమోదు, కార్యాలయాల పని వేళలపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి విధులకు ఆలస్యంగా హాజరవుతున్నట్లు నిర్ధారణ అయితే సంబంధిత అధికారులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి శాఖలో సమయపాలనను కచ్చితంగా అమలు చేయాలని కోరుతున్నారు. ప్రజల ప్రశ్న ఒక్కటే...ప్రభుత్వ కార్యాలయాలకు నిర్ణీత సమయాలు ఉన్నప్పుడు, అధికారులు కూడా ఆ సమయాలను పాటించాల్సిన బాధ్యత లేదా? ప్రజలకు సేవలు చేయాల్సిన ప్రభుత్వ వ్యవస్థలో సమయపాలనకు పెద్దపీట వేయాలని, వైరా మండలంలో ఈ సమస్యపై ఉన్నతాధికారులు స్పందించి వాస్తవ పరిస్థితిని పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.

# వైభవంగా దసరా వేడుకలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నేలకొండపల్లి మండల కేంద్రంలో మంగళవారం దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వరస్వామి, ఉత్తరేశ్వరస్వామి, భీమేశ్వరస్వామి, రాజగోపాలస్వామి ఆలయాలతో పాటు రామదాసు ధ్యాన మందిరం నుంచి ఉత్సవ మూర్తులను ప్రధాన కూడలికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. దసరా సేవ, పారువేట, శమీపూజలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా, శమీపూజ వద్ద భక్తులతో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో బచ్చలకూరి నాగరాజు, మైశా శంకర్, జెర్రిపోతుల అంజని, జెర్రిపోతుల సత్యనారాయణ, రాయపూడి నవీన్, వంగవీటి నాగేశ్వరరావు,మార్తి కోటి, మామిడి వెంకన్న,కడియాల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# సేవాలాల్, మేరమ్మ యాడి ప్రతిష్ఠలో మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలంలోని మంగాపురం తండాలో నూతనంగా నిర్మించిన సంత్ సేవాలాల్, మేరమ్మ యాడి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. సంత్ సేవాలాల్, మేరమ్మ యాడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. బుధవారం ఆలయంలో బోనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధీరావత్ అశోకరాణి, గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# చిన్ననాటి స్నేహానికి చివరి ప్రయాణంలోనూ తోడు

**-ఫోన్‌లో పరామర్శించిన మాజీ మంత్రి సంబాని**





**ప్రజాపక్షం/కూసుమంచి:** కులం వేరు...మతం వేరు..రాజకీయాలు వేరు..కానీ మానవత్వం ఒక్కటేనని కనకం మైసయ్య(54)అంతిమయాత్ర చాటి చెప్పింది. పేద కుటుంబంలో పుట్టి, కారు డ్రైవర్‌గా, ట్రాక్టర్ డ్రైవర్‌గా, కార్మికుడిగా శ్రమిస్తూ జీవించిన ఆయనకు కూసుమంచి ప్రజలు కులమతాలకు అతీతంగా కన్నీటి వీడ్కోలు పలికారు. హిందూ, ముస్లిం సోదరులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తరలివచ్చి నివాళులర్పించడం మైసయ్య సంపాదించుకున్న ఆత్మీయతకు నిదర్శనంగా నిలిచింది.

**తరగతి గది నుంచి చివరి ప్రయాణం వరకు....**

చిన్ననాటి సహాధ్యాయులైన అంతోటి వెంకన్న, మహమ్మద్ సోయబ్, కట్ల నాగేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర బాధ్యుడు ఈదయ్యతో మైసయ్యకు సన్నిహిత అనుబంధం ఉండేది. ముస్లిం స్నేహితుడు సోయబ్‌తో బాల్యం నుంచి కొనసాగిన ఆత్మీయత, అంతిమయాత్రలోనూ కనిపించింది. స్నేహానికి కులమతాలు అడ్డుకావని వారి అనుబంధం చాటిచెప్పింది.

**పార్టీలకు అతీతంగా నివాళులు....**

చిన్నతనం నుంచి కాంగ్రెస్ అభిమాని అయిన మైసయ్య, బీఆర్ఎస్ నాయకుడు, పాలేరు మాజీ ఎంఎల్ఏ కందాల ఉపేందర్‌రెడ్డికి కూడా అభిమానిగా ఉన్నారు. ఆయన మృతికి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, సీపీఎం నాయకులు సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి హఫీజుద్దీన్, కూసుమంచి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ మాదాసు ఉపేందర్‌రావు, గ్రామ సర్పంచ్ కొండ కృష్ణవేణి, మహిపాల్, బీజేపీ మండల నాయకుడు గుండా ఉపేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నలగాటి ప్రసన్న కుమార్, నలగాటి నాగయ్య, మక్కపల్లి రామకృష్ణ, దాసరి వెంకన్న, సీపీఎం కార్మిక నాయకుడు చావ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. మైసయ్య మృతి విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సంబాని చంద్రశేఖర్ ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

# జనసందోహం నడుమ వైభవంగా దసరా

**-ఇల్లందు వేడుకల్లో మంత్రి పొంగులేటి, ఎంపీ పోరిక, ఎంఎల్ఏ కోరం**



**ప్రజాపక్షం/ఇల్లందు:** విజయదశమి సందర్భంగా ఇల్లందులో నిర్వహించిన దస రా వేడుకలు జనసందోహం న డుమ వైభవంగా సాగాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు జరిగిన ఉత్సవాల్లో రాష్ట్ర రెవె న్యూ, గృహ నిర్మాణ, సమాచా ర శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఇల్లందు ఎంఎల్ఏ కోరం కనకయ్యతో కలిసి వేడుకల్లో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఇల్లందులో దసరా వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తూ వేలాది మంది పాల్గొనడం అభినందనీయమని మంత్రి పొంగులేటి అన్నారు. కళాకారుల ఆటపాటలు, ప్రదర్శనలు, ఉత్సాహంగా ఆకట్టుకున్నాయని కొనియాడారు. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి విజయదశమి ప్రతీకగా నిలుస్తుందన్నారు. సత్యం, ధర్మం పట్ల నిబద్ధతతో ముందుకు సాగాలనే సందేశాన్ని ఈ పండుగ అందిస్తుందన్నారు. పండుగలు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటంతో పాటు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. వేడుకల్లో స్థానిక నాయకులు, ఉత్సవ నిర్వాహకులు, కళాకారులు, పట్టణ ప్రజలు వేలాది సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇల్లందు సమస్యలు పరిష్కరించాలి

**-మంత్రి పొంగులేటికి సీపీఐ నాయకుల వినతి**

**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఐ నాయకులు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. దసరా ఉత్సవాల సందర్భంగా ఇల్లందు పర్యట నకు వచ్చిన మంత్రిని సీపీఐ ఇల్లందు మండల సమితి ఆధ్వర్యంలో నాయకు లు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయ లక్ష్మీ నగర్, తిలక్‌నగర్, రాజీవ్ నగర్ ప్రాంతాల ప్రజలకు జీవో నంబర్ 76 ప్రకారం పట్టాలు మంజూరు చేయాలని, ఓసీ నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి త్వరలో కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈకార్యక్రమంలో సీపీఐ ఇల్లందు డివిజన్ కార్యదర్శి కే సారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవరకొండ శంకర్, ఇల్లందు మండల కార్యదర్శి బొప్పిశెట్టి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి బాషా శ్రీనివాసరావు, ఏఐటీయూసీ ఇల్లందు బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్, గిరిజన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగులోత్ కృష్ణ, తిలక్‌నగర్ ఉప సర్పంచ్ షేక్ ఖాసీం, బస్సుపాక రవి, గుడిపల్లి భాస్కర్, తిరుమలరావు, కలవల రాజయ్య, రాఘవేంద్రరావు, వీరయ్య, లక్ష్మ ణరావు, కోటి, అజయ్‌రెడ్డి, ససప సరోజ, వెంకన్న, బల్లెం జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

# దుర్గామాత అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

**-మహా చండీ హోమం, ఆటపాటలతో కనకదుర్గమ్మ ఊరేగింపు**
**-భక్తిశ్రద్ధలతో అమ్మవారి నిమజ్జనం**





**ప్రజాపక్షం/కారేపల్లి:** మండల కేంద్రంలోని బీసీ కాలనీలో జైశ్రీరామ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి మండపం వద్ద మహా చండీ హోమం నిర్వహించారు. దుర్గామాత అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వడంతో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కనకదుర్గమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఊరేగింపులో మహిళలు, యువకులు, కాలనీవాసులు ఆటపాటలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తుల జయజయధ్వానాలు, అమ్మవారి నామస్మరణతో బీసీ కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బాలికలు, అమ్మవారి అవతారాల్లో ప్రదర్శించిన నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జైశ్రీరామ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాచండీ హోమం, ప్రత్యేక పూజలు, ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రయాణికుల కోసం సీలింగ్ ఫ్యాన్లు వితరణ

**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రయాణికుల సౌకర్యార్థం జీవన ఆస్పత్రి కోశల హోటల్ అధినేత చల్లగుళ్ల నాగేశ్వరరావు టిజిఎస్ ఆర్టిసి డిపో మేనేజర్ జంగయ్యకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా చల్లగుళ్ల మాట్లాడుతూ దేశవిదేశాల నుండి భద్రాచలం టిజిఎస్ ఆర్టిసి ప్రయాణికుల ప్రాంగణానికి వేలాది మంది భక్తులు వస్తుంటారని, రాత్రివేళల్లో నిద్రిస్తుంటారని వారి సౌకర్యార్థం 10సీలింగ్ ఫ్యాన్లు అందించినట్లు చెప్పారు. ఫ్యాన్లు వితరణంగా ఇచ్చినందుకు డిపో మేనేజర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి విజయశ్రీ స్టేషన్ మేనేజర్ ఎం వెంకన్న కంట్రోలర్ మీసా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# దసరా ఉత్సవంలో డీజే వివాదం ఉద్రిక్తం



**-సవాళ్లు.. ప్రతిసవాళ్లతో హోరెత్తిన ప్రధాన కూడలి**
**-పోలీసుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ వాగ్వాదం**
**-రాజకీయ వివాదంతో ఇబ్బందులు పడ్డ భక్తులు**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** భక్తిభావంతో సాగాల్సిన దసరా ఉత్సవం రాజకీయ ఆధిపత్య పోరుకు వేదికైంది. డీజేల హోరు, పోటాపోటీ నృత్యాలు, సవాళ్లు, ప్రతిసవాళ్లతో నేలకొండపల్లి మండల కేంద్రం లోని ఉత్సవ ప్రాంగణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరువర్గాల మధ్య పోటీ తీవ్రం కావడంతో పోలీసులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో పోలీసులతో వాగ్వాదం జరగడంతో కొద్దిసేపు అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది. మంగళవారం నిర్వహించిన దసరా ఉత్సవం పారువేట సందర్భంగా ఇరువర్గాలు పోటాపోటీగా డీజేలను ఏర్పాటు చేసుకున్నాయి. తమ పాటలతో కార్యకర్తలు నృత్యాలు చేస్తూ ర్యాలీలు నిర్వహించారు. ప్రధాన కూడలి వద్ద ఇరువర్గాలు ఎదురుపడటంతో డీజేల శబ్దాన్ని పెంచుతూ ఎవరికి వారే పైచేయి సాధించేందుకు ప్రయత్నించారు. దీంతో ఆ ప్రాంతమంతా డీజేల హోరుతో మారుమోగింది. దసరా మహోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఈ పోటీ తీవ్ర అసౌకర్యాన్ని కలిగించింది. ఉత్సవాన్ని ప్రశాంతంగా వీక్షించలేని పరిస్థితి ఏర్పడటంతో పలువురు భక్తులు అసహనం వ్యక్తం చేస్తూ వెనుదిరిగారు. ఏటా సంప్రదాయబద్ధంగా, వైభవంగా జరిగే ఉత్సవంలో రాజకీయ పోటీ చోటుచేసుకోవడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితిని గమనించిన పోలీసులు ఇరువర్గాల డీజేలను నిలిపివేయాలని ఆదేశించారు. అయినప్పటికీ నిర్వాహకులు ఆదేశాలను పట్టించుకోకపోవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో ఎస్సై పి.శ్రీనివాసరెడ్డి డీజేను అక్కడి నుంచి తరలించేందుకు ప్రయత్నించగా కొందరు అడ్డుతగిలినట్లు తెలిసింది. పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో పాటు వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఘటనా స్థలానికి ఇరువర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుకోవడంతో ఏం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. ప్రజలంతా కలిసి పండుగను ఆనందంగా జరుపుకోవాల్సిన వేళ రాజకీయ ఆధిపత్యం కోసం పోటీపడటంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సంప్రదాయాలకు ప్రాధాన్యమివ్వాల్సిన ఉత్సవాల్లో రాజకీయ వివాదాలకు తావివ్వడం సరికాదని అభిప్రాయపడ్డారు. దసరా ఉత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందని, భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు.

# పోలీస్ అమర వీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

**- ఘన నివాళి అర్పించిన ఎస్‌పి రోహిత్‌రాజ్**



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుంటా గుండెలెను ఎదురొడ్డిన పోలీస్ అమర వీరుల త్యాగాలే పోలీస్ శాఖ అసలు సిసలైన స్ఫూర్తి అని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. విధి నిర్వహణలో అసువులుబాసిన పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద ఆయన పుష్పగుచ్ఛాలుంచి ఘన నివాళి అర్పించారు. అనంతరం సాయుధ పోలీసులు శోక్‌శస్త్ర నిర్వహించి అమరులకు గౌరవ వందనం సమర్పించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరతరం కృషి చేస్తూ విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. వారిత్యాగాలు ప్రతీ పోలీస్ అధికారి సిబ్బందికి స్ఫూర్తిదాయకం అన్నారు. వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని అంతా అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని డిఎస్‌పిలు, పోలీస్ అధికారులు పాల్గొని నివాళ్లర్పించారు.

# బతుకుదెరువు కోసం వచ్చిన వలస కూలీపై దాడి



**-19ఏళ్ల యువకుడికి తీవ్ర గాయాలు,**
**ఖమ్మం ఆసుపత్రికి తరలింపు**

**ప్రజాపక్షం/కారేపల్లి:** పొట్టకూటి కోసం ఇతర రాష్ట్రం నుంచి వలస వచ్చి కూలి పని చేసుకుంటున్న 19ఏళ్ల యువకుడిపై దాడి జరిగిన ఘటన సింగరేణి మండలం మాణిక్యారం గ్రామంలో బుధవారం కలకలం రేపింది. ఈ ఘటనలో రాజు అనే యువకుడు తీవ్రంగా గాయపడగా, మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. స్థానికుల కథనం ప్రకారం మాణిక్యారం గ్రామంలో కూలి పని చేసుకుంటున్న రాజుపై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. గాయపడిన యువకుడిని సహచర కూలీలు, స్థానికులు కారేపల్లి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లగా, పోలీసులు వివరాలు సేకరించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం గాయాల తీవ్రత దృష్ట్యా ఖమ్మం ఆసుపత్రికి ఆటోలో తీసుకెళ్లారు.

**కక్షతోనే దాడి చేశారనే ఆరోపణ...**

రాజుపై దాడిని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. గతంలోనూ సంబంధిత రైతు రాజుపై దాడి చేయడంతో అతను అక్కడ పని మానేసి మరో రైతు వద్దకు వెళ్లాడని తెలిపారు. ఈ నేపథ్యంలోనే కక్షతోనే మరోసారి దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని ఆరోపించారు. ఘటనపై ఫిర్యాదు చేసేందుకు సహచర కూలీలు, స్థానికులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా కేసు నమోదు చేయకుండా, నిందితుడిని స్టేషన్‌కు పిలిపించకుండా గాయపడిన యువడిని ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించడం సరికాదన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు ఎదుర్కొంటుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా గాయపడిన రాజుకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు వైద్య ఖర్చులన్నీ ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తే భరించేలా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ ఘటనను తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సింగరేణి మండల అధ్యక్షుడు కేశగాని ఉపేందర్, కార్యదర్శి యనమనగండ్ల రవి తదితరులు ఖండించారు.

# కాలిన గాయాల బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

**-ఆసుపత్రి సూపరింటెండెంట్లకు ఎంపీ పోరిక ఆదేశం**



**ప్రజాపక్షం/ఇల్లందు:** ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, సుమారు 80శాతం కాలిన గాయాలతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ సంబంధిత ఆసుపత్రుల సూపరింటెండెంట్లను ఆదేశించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చికిత్సలో నిర్లక్ష్యం లేకుండా చూడాలని సూచించారు. ్ధచించారు మండల కేంద్రంలో టీజీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, జీఎల్ఎస్ జేఏసీ ఛైర్మన్ ఇస్లావత్ లక్ష్మ ణ్ నాయక్ నివాసాన్ని ఎంపీ సందర్శించారు. ఈసందర్భంగా లక్ష్మ ణ్ నాయక్ కుటుంబ సభ్యులు శాలువాలతో ఎంపీని సత్కరించారు. ఎంపీ పర్యటన విషయం తెలుసుకున్న వెంకట్యతండా వాసులు మూడు రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో గాయపడిన బాధితులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. దీనిపై ఎంపీ వెంటనే స్పందించి ఆసుపత్రి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచిన ఎంపీ చొరవపై స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇస్లావత్ రెడ్యానాయక్, మాజీ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్యా దేవానాయక్, జగన్ నాయక్, ఇస్లావత్ సాయి, రవి, కుమార్, బాలు, చంప్లా, చంద్రు, ఆంగోత్ లక్ష్మీ పతి, శ్రీను, బిచ్చు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

# వినాయక స్వామి గుడిలో అన్నదానం



**ప్రజాపక్షం/మధిరః** మధిర మెయిన్ రోడ్డులో వినాయక స్వామి గుడిలో బుధవారం స్వామి వారికి విశేషమైన పంచామృతాలతో, గోత్రనామాలతో పూజలు, నైవేద్యం, ధాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కీర్తిశేషులు కోనా వెంకట సుబ్బారావు వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రవి శాస్త్రిచే పూజా కార్యక్రమాలు నిర్వహించి తదనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

# పండుగ పూట విషాదం

**-యువ న్యాయవాది ఆత్మహత్య**



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** పండుగ పూట ఆ కుటుంబంలో తీరని విషాదం అలుముకుంది. భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో న్యాయవాద వృత్తిలో అడుగుపెట్టిన ఓ యువకుడు అర్థంతరంగా తనువు చాలించాడు. వివరాల్లోకి వెళితే... మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం గ్రామానికి చెందిన తొలుపునూరి గణేష్ (27) ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. గణేష్ ఖమ్మం కోర్టులో ఏడాది కాలంగా జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నాడు. దసరా పండుగ సందర్భంగా తన అన్న సాయితేజతో కలిసి సోమవారం ముదిగొండ మండలం పెద్దమండవ గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్న సమయంలో అమ్మమ్మ, సోదరుడు దేవాలయానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి గణేష్ ఇంట్లో సిలింగ్ ఫ్యాన్‌కు ఊరేసుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు కిందకు దించి చూడగా అప్పటికే గణేష్ మృతిచెందాడు. గణేష్ మృతికి సంబంధించి తండ్రి దానయ్య ముదిగొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నాలుగు రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు తనను వెంబడిస్తున్నారని, ఫోన్‌లో వేధింపులకు గురి చేస్తున్నారని గణేష్ చెప్పినట్లు తండ్రి దానయ్య తెలిపారు. ఆ ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుందనే ఉద్దేశంతో అమ్మమ్మ ఇంటికి పంపించామని కానీ ఇలా ఆత్మహత్య చేసుకుంటాడని ఊహించ లేదని తండ్రి రోదించాడు. తన కుమారుని మృతిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. గణేష్ మృతితో వి. వెంకటాయపాలెం, పెద్దమండవ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# క్యాన్సర్ బాధిత చిన్నారికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/మధిరః** మధిర ఎస్సీ కాలనీకి చెందిన రెడపంగి దానమ్మ మనుమడు చిన్నారి అభిరామ్ కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ధాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నటువంటి వాళ్లకు పుల్లఖండం శేఖర్ రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. వైద్య ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబానికి అండగా నిలిచిన పుల్లఖండం శేఖర్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ముగిసిన శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు



**ప్రజాపక్షం/మధిరః** మధిర పట్టణంలోని లడకబజార్‌లో దేశభక్త యువజన సంఘం ఆధ్వర్యంలో గత 10 రోజులుగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్యన శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ముగిశాయి. చివరి రోజు శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో నల్లబోతుల శ్రీనివాసరావు, శ్రీదేవి దంపతులు, చక్రవర్తుల వరదరాజన్ హేమమాలిని దంపతులు, పర్వతం కృష్ణతేజ పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేశభక్త యువజన సంఘం కమిటీ వారు పాల్గొన్నారు. దీంతో పది రోజుల పాటు లడక బజార్‌లో ఆధ్యాత్మిక సందడి నింపిన నవరాత్రి ఉత్సవాలకు ఘనంగా ముగింపు పలికారు.

# అశ్వారావుపేటలో ఉచిత కంటి వైద్యశిబిరం

**ప్రారంభించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ**
**సందర్శించిన మాజీ ఎమ్మెల్యే మచ్చా నాగేశ్వరరావు**





**ప్రజాపక్షం/వైరా/అశ్వారావుపేట:** లయన్స్‌క్లబ్ ఆఫ్ అశ్వారావుపేట ఆధ్వర్యంలో వైరా లయన్స్ కంటి ఆసుపత్రి సహకారంతో బుధవారం అశ్వారావుపేటలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే మచ్చా నాగేశ్వరరావు శిబిరాన్ని సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా శిబిరం నిర్వహణలో సహకరించిన డాక్టర్ కాపా మురళీకృష్ణ, వుంద్రు శ్యామ్‌బాబును ఘనంగా సన్మానించారు. డాక్టర్ జి.రవిచంద్ర( ఎంబిబిఎస్, ఎంఎస్ ఆప్తాల్మాలజి) ఆధ్వర్యంలో శిబిరంలో కంటి వైద్య సేవలు అందించారు. పాంప్లెట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం గ్లకోమా( కంటి ఒత్తిడి) పరీక్షలు, సంపూర్ణ కంటి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, అవసరమైన వారికి తక్కువ ఖర్చుతో కంటి అద్దాలు, కంటి శస్త్రచికిత్సలు అందించేలా ఏర్పాట్లు చేశారు. అశ్వారావుపేటలోని టివిఎస్ షోరూమ్ సమీపంలో, ఆదిత్య హాస్పిటల్ వద్ద ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వైద్యసేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స తీసుకోవడం ద్వారా చూపును కాపాడుకోవచ్చని వైద్యులు సూచించారు. ముఖ్యంగా వయోవృద్ధులు, చూపు సమస్యలతో బాధపడుతున్న వారు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యసేవలకు దూరమవుతున్న పేదలకు వైరా లయన్స్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించే ఇటువంటి శిబిరాలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ కాపా మురళీకృష్ణ, వుంద్రు శ్యామ్‌బాబు, డాక్టర్ రవిచంద్రలను ఈ సందర్భంగా సన్మానించారు.

# డిప్యూటీ సీఎం భట్టికి ఘన స్వాగతం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు స్థానిక కాంగ్రెస్ నాయ కులు ఘన స్వాగతం పలికారు. మంగ ళవారం సూర్యాపేట జిల్లా, కోదాడ నుంచి ముదిగొండ మండలం లోని వెంకటాపురం కు వస్తున్న భట్టిని స్థానిక కాంగ్రెస్ నాయకులు పైనంపల్లి టోల్ గేట్ వద్ద ఆపారు. పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, మండల అధ్యక్షుడు యడవల్లి నాగరాజు, సోమనబోయిన సాయి నవీన్, చారీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జమ్మి పూజ



**ప్రజాపక్షం/వైరా:** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని వైరా మున్సిపాలిటీ పరిధిలోని లాలాపురం గ్రామంలో శ్రీకోదండ రామాలయం వద్ద మహిళలు జమ్మి పూజను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి జమ్మి ఆకులను పరస్పరం ఇచ్చిపుచ్చుకుంటూ దసరా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. విజయదశమి పర్వదినం సందర్భంగా మహిళలు సంప్రదాయబద్దంగా పూజల్లో పాల్గొని భక్తిభావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంతో ఆలయ పరిసరాల్లో పండుగ సందడి నెలకొంది. ఈ జమ్మి పూజ కార్యక్రమంలో దామా ఉమా, దామా లక్ష్మీ సుజాత, రమాదేవి, పాసంగులపాటి జ్యోతి, శారదా, కట్టా జ్యోతి, కవిత తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు మానసికోల్లాసానికి దోహదం : ఎస్ఐ





**ప్రజాపక్షం/వైరా:** క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని వైరా ఎస్సై పుష్పాల రామారావు, సమక్ తక్రా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కాపా మురళీకృష్ణ సూచించారు. వైరా మున్సిపాలిటీ పరిధిలో మూడు రోజులపాటు నిర్వహించిన 6టు6 క్రికెట్ టోర్నమెంట్ బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్సై పుష్పాల రామారావు, డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ క్రికెట్ అంటే భారతీయులందరికీ ఎంతో ఇష్టమని, ఈ ఆటతో పాటు ఇతర క్రీడల్లోను యువత చురుకుగా పాల్గొనాలని అన్నారు. క్రీడలు ఆడటం వలన శారీరక ధృఢత్వం పెరగడంతో పాటు మానసిక ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయని పేర్కొన్నారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతో దోహదపడతాయని తెలిపారు. యువకులందరూ ఐకమత్యంతో, ఆనందంగా ఈ పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన జట్లకు అతిథులు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి షీల్డ్‌ను మణుగూరు జట్టు, రెండో బహుమతిని కాపా రాయల్ జట్టు, మూడో బహుమతిని గణేష్ జట్టు కైవసం చేసుకున్నాయి. మొదటి బహుమతిని వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, డాక్టర్ కాపా మురళీకృష్ణ అందజేశారు. రెండో బభుమతిని 20వ వార్డు కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి , శ్యామ్‌బాబుల అందించారు. మూడో బహుమతిని కాంగ్రేస్ నాయకుడు పెరుగు ప్రసాద్ అందజేశారు. టోర్నమెంట్‌లో ఆల్‌రౌండర్‌గా ఎంపికైన క్రికెటర్‌కు రెండో వార్డు కౌన్సిలర్ తిరుపతి శివకుమారి, శ్రీను బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో పొదిలి హరినాథ్, తోటకూర శ్రీకాంత్, ఉయ్యూరు రామకృష్ణ, పెనుగొండ ఉపేందర్‌రావు, వాకుం డోతు బీక్యా, టోర్నమెంట్ కమిటీ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే, సుడా చైర్మన్‌ను కలిసిన నరేష్



**ప్రజాపక్షం/వైరా:** వైరా వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌కు నూతనంగా బాధ్యతలు చేపట్టిన కార్యదర్శి ఈ.నరేష్‌కుమార్ మర్యాదపూర్వకంగా వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌లను కలిశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వీరంశెట్టి సీతారాములుతో కలిసి బుధవారి వారిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, సుడా చైర్మన్ దుర్గాప్రసాద్‌లను నూతన కార్యదర్శి నరేష్‌కుమార్ శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైరా వ్యవసాయ మార్కెట్‌యార్డ్ అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేష్‌రావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

# రైల్వే ట్రాక్‌పై యువకుని మృతదేహం

**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి :** మండల పరిధిలోని యర్రగుంట గ్రామ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై యువకుని మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అన్నపురెడ్డిపల్లి మండలం శాంతినగర్ గ్రామానికి చెందిన పాయం శ్రీనివాసరావు (21) అనే గిరిజన యువకుడు యర్రగుంట గ్రామ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై మృతి చెందిన సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టు మార్టం నిమిత్తం రైల్వే నిబంధనల ప్రకారం మృతదేహాన్ని రైల్వే పోలీసులకు అప్పగించారు. రైలు ఢీకొట్టం వల్లే యువకుడు మరణించి ఉంటాడని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. మృతికి గల ఖచ్చితమైన కారణాలు తెలియాల్సుంది.



# పెద్దమ్మతల్లి గుడిలో ముగిసిన ఉత్సవాలు

**- సామూహిక సత్యనారాయణ వ్రతం**



**ప్రజాపక్షం/పాల్వంచ :** మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్యన కొలువై ఉన్న (శ్రీకనకదుర్గ) పెద్దమ్మతల్లి దేవాలయంలో ఈ నెల 11వ, తేదీన ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు కలశ పూజలు నిర్వహించి, ప్రారంభించిన శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉత్సవాలలో భాగంగా చివరి రోజు విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకొని వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకొన్నారు. ఈ సంధర్భంగా ఋత్విక్కులు, దేవస్థాన అర్చకులచే పెద్దమ్మతల్లికి ఉదయం సుప్రభాతసేవ, ప్రాత:కాలార్చన అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు కోలాటం, అమ్మవారి వేశాధారణ, కళాకారుల నృత్యాలతో సాయంత్రం కేశవాపురం, జగన్నాధపుర,ం గ్రామాల మీదుగా అంగరంగ వైభవంగా రథోత్సవం నిర్వహించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలోని కోనేరులో అమ్మవారిని హంసవాహనంపై తెప్పోత్సవం అనంతరం జమ్మిచెట్టు వద్దకు తల్లిని తీసుకెళ్ళి శమీపూజ జరిపించారు.ఉత్సవాల అనంతరం దేవాలయంలో సామూహిక శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం, దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు. భక్తుల సౌకర్యం కోసం దేవస్థానం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వాహణాధికారి విజయాచారి, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవాలయ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సరిహద్దుల్లో తెల్లరాయి టిప్పర్లు సీజ్

**ప్రజాపక్షం/భద్రాచలం :** తెలంగాణ సరిహద్దు ఏపిలోని ఎటపాక మండలం నెల్లిపాక చెక్‌పోస్టు వద్ద ఆ రాష్ట్ర అటవీశాఖ అధికారులు తెల్లరాయిని తరలించుకుపోతున్న రెండు టిప్పర్లను అదుపులోనికి తీసుకుని సీజ్ చేశారు. చింతూరు సమీప అటవీ ప్రాంతాల్లో అనుమతులు లేకుండా తెల్లరాయిని సేకరించి అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో అప్రమత్తమైన అటవీ అధికారులు రెండు లారీలను ఆపీ సోదాలు చేయగా రాయి బయటపడటంతో వాటిని నెల్లిపాక అటవీ రేంజ్ కార్యాలయానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తవ్వి తీసిన రాయిని తరలించేందుకు ఎలాంటి ట్రాన్సిట్ అనుమతి లేకుండా తరలిస్తుండగా పట్టుకున్నట్లు అటవీ అధికారులు చెబుతున్నారు. గనులు, భూముల నుండి ఖనిజాలను తవ్వి తరలించేందుకు సంబంధిత మైనింగ్ శాఖ ఇచ్చే అధికారిక అనుమతులు తప్పని సరీ అని వారు చెబుతున్నారు.

# ఇండ్ల కేటాయింపులో అక్రమాలు అరికట్టాలి



**-నేడు కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో అక్రమాలు అరికట్టాలని, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల హక్కులను పరిరక్షించాలని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌సి తాతా మధుసూదన్ డిమాండ్ చేశారు. బుధవారం బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఎంఎల్‌సి తాతా మధుసూదన్ అధ్యక్షతన ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంఎల్ఎ సండ్ర వెంకటవీరయ్య, జెడ్పి మాజీ ఛైర్మన్ లింగాల కమల్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామసభల తీర్మానాలను పక్కనపెట్టి స్థానిక సంస్థల వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. సర్పంచులు, వార్డు సభ్యుల హక్కులను కాలరాస్తూ కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ కమిటీల పేరిట తమ సొంత ప్రయోజనాల కోసం అర్హులను విస్మరిస్తూ అక్రమాలకు పాల్పడుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులను పారదర్శకంగా లాటరీ పద్ధతిలో చేపట్టాలని, తక్షణమే ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలని, సర్పంచులు ఇచ్చిన జాబితా ఆధారంగా లబ్దిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. వితంతువులు, దివ్యాంగులు, ప్రమాదవశాత్తు ఇండ్లు కోల్పోయిన పేదల కుటుంబాలకు మొదటి ప్రాధాన్యతనిచ్చి ఇండ్లు కేటాయించాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికే బిఆర్ఎస్, సిపిఐ, సిపిఎం, సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్, సిపిఐ(ఎంఎల్)ఎన్డి పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు ఖమ్మం కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని బిఆర్ఎస్ శ్రేణులు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పగడాల నాగరాజు, బెల్లం వేణు, ఎండి ఖమర్, పోట్ల శ్రీనివాస్, ముత్యాల సత్యనారాయణ, బానాల వెంకటేశ్వర్లు, బాషబోయిన వీరన్న, అచ్చయ్య, ఆసిఫ్ పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి వారధి పౌండేషన్ రూ. 25వేలు వితరణ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఆలయ అభివృద్ధికి వారధి పౌండేషన్ అండగా నిలిచింది. ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు ఎఫ్‌సిఐ గోడౌన్ వద్ద ఉన్న శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి వారధి ఫౌండేషన్ తరుపున ఛైర్మన్ చింతనిప్పు కృష్ణచైతన్య విజయదశమి పర్వదిన సందర్భంగా రూ. 25 వేలు వితరణ చేశారు. గతంలో మున్నేరుకు వచ్చిన వరద వల్ల ఆలయం ముంపుకు గురైంది. ఆలయ మరమ్మతులకు తమ సంస్థ తరుపున అండగా నిలుస్తున్నామని చింతనిప్పు కృష్ణచైతన్య తెలిపారు. ఆలయంలో పూజా కార్యక్రమాలు ఎటువంటి ఆటంకం లేకుండా సజావుగా జరిగేందుకు వారధి ఫౌండేషన్ ద్వారా రూ. 25వేల నగదును ఆలయ అర్చకులు మేడూరి రవికుమార్‌కు అందజేశారు. వారధి పౌండేషన్ ఆధ్వర్యంలో తొలిసేవ కార్యక్రమం దైవ కార్యంలో భాగస్వాములు అవుతున్నందుకు ఆనందంగా ఉందని కృష్ణ చైతన్య తెలిపారు. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో తాము నిర్వహించే సేవా కార్యక్రమాలు దిగ్విజయంగా ముందుకు సాగేలా స్వామి వారు దీవెనలు అందించాలని కోరారు. దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కృష్ణ చైతన్య కోరారు. ఈ కార్యక్రమంలో వారధి ఫౌండేషన్ సభ్యులు ఎం. సాయి, చిక్కుళ్ల వెంకటేష్, పగిళ్లపల్లి రాజు, నాగరాజు, శివ, భక్తులు పాల్గొన్నారు.

# రేషన్ షాపుల్లో నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** స్థానిక దొడ్డ కృష్ణయ్య భవనంలో సిపిఎం తల్లాడ మండల కమిటీ సమావేశం నల్లమోతు మోహన్‌రావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ వాతావరణ మార్పుల ప్రభావంతో రైతులు, వ్యవసాయ కూలీలు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మరో వైపు నిత్యావసర వస్తువుల ధరలు రోజు రోజుకు పెరుగుతుండడంతో సామాన్య ప్రజలు వాటిని కొనుగోలు చేయలేని దుస్థితి నెలకొందన్నారు. ముఖ్యంగా బియ్యం ధరలు పెరుగుతుండడంతో పేద, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం పడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగకుండా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మధ్యవర్తుల కారణంగా బియ్యం ధరలు పెరుగుతున్న పరిస్థితులపై ప్రభుత్వాలు దృష్టిసారించి ధరల నియంత్రణకు తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, పులి కృష్ణయ్య, నరేష్, నాగేశ్వరరావు, జీవరత్నం, ఆనందరావు, బిక్షం, కృష్ణయ్య, వెంకటయ్య, దర్గయ్య పాల్గొన్నారు.

# బోనమెత్తిన ఎంపిడివో సుస్మిత



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ పట్టణానికి చెందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మి దేవిపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి గోపిశెట్టి సుస్మిత తల్లాడలో బోనాలు ఎత్తుకున్నారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా స్థానిక కోట మైసమ్మ ఆలయంలో బుధవారం ఆమె బోనాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబురాలు



**ప్రజాపక్షం/ తల్లాడ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ సంబురాలు గొల్లగూడెం గ్రామ పంచాయతీలో అంబరాన్నంటేలా జరిగాయి. గ్రామ సర్పంచ్ కోడూరి ఉమాదేవి వీరకృష్ణ నేతృత్వంలో నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళల ఆటపాటలు, బతుకమ్మల సందడి మధ్య పండుగ శోభను సంతరించుకున్నాయి. సద్దుల బతుకమ్మ వేడుకలు తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనానికి ప్రతీకగా నిలిచాయి. మహిళలు రంగు రంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబురాల్లో పాల్గొన్నారు. గ్రామంలోని మహిళలు, యువతులు, విద్యార్థినులు, విద్యార్థులు, యువకులు, గ్రామ ప్రజల భాగస్వామ్యంతో వేడుకలు వైభవంగా సాగాయి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారపోగు వెంకట్, ఉప సర్పంచ్ తోటపల్లి నాగలక్ష్మి, మాజీ ఎంపిటిసి ఇలాసాగరం మణిమ్మ, విడిసి ఛైర్మన్ కోడూరి వీరకృష్ణ, ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు అశోక్, గ్రామ పెద్దలు, మహిళలు, విద్యార్థినిలు, యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తల్లాడలో ఘనంగా బోనాల వేడుకలు



**ప్రజాపక్షం/ తల్లాడ :** దగ్గుల శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు, తల్లాడ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులందరూ కలిసి బోనాలు ఎత్తుకుని కోట మైసమ్మ తల్లికి బుధవారం బోనాలు సమర్పించారు. దేవీ శరన్నవరాత్రి దసరా ఉత్సవాల్లో భాగంగా కుటుంబ సభ్యులందరూ ఒక్కటై బోనాలు ఎత్తుకుని కార్యక్రమాన్ని నిర్వహించారు. కోట మైసమ్మ ఆలయ ఛైర్మన్ లగడపాటి నెహ్రూ సహకారంతో దగ్గుల కుటుంబ సభ్యులు ఆలయానికి చేయూతగా, అండగా ఉంటూ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో దగ్గుల నర్సింహారెడ్డి, అప్పిరెడ్డి, శివారెడ్డి, శ్రీనివాసరెడ్డి, వడ్డెర సంఘం నాయకులు చల్లా ఏడుకొండలు, చల్లా ఆంజనేయులు, చల్లా కృష్ణ, నాగులు రాము, నాగరాజు పాల్గొన్నారు.

# తల్లాడలో ఎంఎల్‌సి అభ్యర్థి ప్రచారం



**ప్రజాపక్షం/ తల్లాడ :** ఖమ్మం వరంగల్ నల్గొండ ఎంఎల్‌సి ఎన్నికల్లో భాగంగా తనను గెలిపించాలని కోరుతూ ఎంఎల్ సి అభ్యర్థి షేక్ షఫీఉల్లా బుధవారం తల్లాడలో ప్రచారం నిర్వహించారు. తల్లాడ పట్టణం లో పలువురు పట్టభద్రులను కలిసి ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక వాలీబాల్ కోర్టులో ఆయనను పలువురు క్రీడాకారులు, ముస్లిం మతపెద్దలు శాలువతో ఘనంగా సన్మానించారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో భాగంగా పట్టభద్రులను కలిసేందుకు తల్లాడకు వచ్చినట్లు వివరించారు. తనను ఆదరించి గెలిపిస్తే నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ ఈసూబ్, ఎండి బహుదూర్, వెంకట్, వెంకటేశ్వర్లు, శ్రీను, సంపత్, ఖాజామియా, మెహరాజ్, యాకోబు, అరుణ్, శ్రీకాంత్, ముస్తఫా, యాసిన్, దాదా అక్బర్, రఫీ, మనోజ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# వృద్ధులకు పండ్ల పంపిణీ



**ప్రజాపక్షం/వైరా:** వైరా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైరా మండలం గొల్లపూడి గ్రామంలోని వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులకు వైరా ఎస్సై పుష్పాల రామారావు పండ్లు పంపిణీ చేశారు. ప్రజల రక్షణ, సమాజ శ్రేయస్సు కోసం విధులు నిర్వహిస్తూ ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకుంటూ ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వృద్ధులకు పండ్లు అందజేసిన ఎస్సై రామారావు వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై రామారావు మాట్లాడుతూ సమాజంలో వృద్ధుల పట్ల ప్రతిఒక్కరూ మానవత్వం, ప్రేమ, ఆప్యాయతతో వ్యవహరించాలని సూచించారు. ఆపదలో ఉన్నవారికి, వృద్ధులకు అండగా, నిలవడం ప్రతిఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజానికి మానవతా సందేశాన్ని అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొల్లపూడి సర్పంచ్ మేడూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి శోభయాత్ర ప్రారంభం



**ప్రజాపక్షం/వైరా:** దేవి నవరాత్రుల ముగింపు సందర్భంగా వైరా మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో మండల పరిషత్ కార్యాలయం సమీపంలో నిర్వహించిన అమ్మవారి పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరిగాయి. నవరాత్రుల ప్రారంభం నుంచి ముగింపు వరకు ఉత్సవ కమిటీ సభ్యులు వైరా మున్సిపాలిటీ తొలి వైస్ ఛైర్మన్ ముళ్ళపాటి సీతారాములు దంపతుల వివిధ కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రుల చివరి రోజు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ముళ్ళపాటి సీతారాములు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం అమ్మవారి రధాన్ని ప్రారంభించి శోభయాత్రను ముందుండి నడిపించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భగా ఆ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ముళ్ళపాటి సీతారాములు మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, నియమనిష్టలతో నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులు భక్తులందరి కుటుంబాలపై ఉండాలని, ప్రతిఒక్కరికి మంచి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగడాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.